క్లుప్తంగా

సూరేశ్వరస్వామి గ్రామోత్సవం



పురవీధులలో స్వామి వారి గ్రామోత్సవం

ముమ్మిడివరం: స్థానిక ఉమా సూరేశ్వరస్వామి ఆలయంలో మంగళవారం ధనుర్మాస పూజలు ఘనంగా నిర్వహించారు. స్వామివారిని పుర వీధులలో ఊరేగిస్తూ గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ అర్చకులు కొత్తలంక సూరిబాబు, చింతా రామకృష్ణశర్మ ఆధ్వర్యంలో స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

కొనసాగుతున్న ఉరుసు ఉత్సవాలు



దర్గా వద్ద ప్రార్థనలు చేస్తున్న జిల్లా వక్ఫ్‌బోర్డు చైర్మన్ ఖాదర్ తదితరులు

అమలాపురం టౌన్: స్థానిక ముస్లిం వీధిలోని హజరత్ ఖ్వాజాబాబా దర్గా వద్ద ఉరుసు ఉత్సవాలు రెండో రోజు మంగళవారం కూడా వైభవంగా జరిగాయి. ముస్లింలు దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. రెండో రోజు ఉత్సవాల్లో జిల్లా వక్ఫ్ బోర్డు చైర్మన్ షేక్ అబ్దుల్ ఖాదర్, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు సంసాని బులినాని పాల్గొని ప్రార్థనలు చేశారు. ఈ సందర్భంగా బులినానిని ముస్లిం యువజన కమిటీ ఆధ్వర్యంలో సత్కరించారు. అనంతరం ఉరుసు కమిటీ ఆధ్వర్యంలో ముస్లింలకు భోజనాలు ఏర్పాటుచేశారు. ఉత్సవాల్లో ముస్లిం నాయకులు వలి, బాషాజాన్, ఎండీ బషీర్, షాజిద్ హజారి, అలీషా, మున్నా, ఫిరోజ్ పాల్గొన్నారు.

ఎస్టీయూ మండల కార్యవర్గం నియామకం



వై.శ్రీనివాస్



నూకల ఋషేంద్రకుమార్

ఉప్పలగుప్తం: మండలంలోని భీమనపల్లి ఎంపీపీ పాఠశాలలో మంగళవారం ఎస్టీయూ మండల అధ్యక్షుడు సూదా రామారావు ఆధ్వర్యంలో నూతన కార్యవర్గాన్ని నియమించారు. మండల అధ్యక్షుడిగా వై.శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శిగా నూకల ఋషేంద్రకుమార్, ఆర్థిక కార్యదర్శిగా డి.బాలకృష్ణ, జిల్లా కౌన్సిలర్‌గా చిక్కం మైనర్‌బాబు, ఎన్నికల పరిశీలకుడిగా నిమ్మన సత్యనారాయణలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం నూతన కార్యవర్గంతో ప్రమాణస్వీకారం చేయించారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు నాగిరెడ్డి శివప్రసాద్, ఎస్ఎస్ పల్లంరాజు, జీవీ కృష్ణారావు, వై.భాస్కరశాస్త్రి, ఎం.సతీష్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

5న విద్యుత్ వినియోగదారుల పరిష్కార వేదిక

యానాం: ఈ నెల 5న స్థానిక అసిస్టెంట్ ఇంజినీర్ కార్యాలయంలో కేంద్రపాలిత ప్రాంతాలు, గోవా రాష్ట్ర ఉమ్మడి విద్యుత్ నియంత్రణ కమిషన్ ఏర్పాటుచేసిన వినియోగదారుల పరిష్కార వేదిక జరగనుందని ఏఈ లంక కృష్ణారావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకూ పేరు బదిలీ, బిల్లుల జారీ, పనిచేయని విద్యుత్ మీటర్ల మార్పు, విద్యుత్ అంతరాయం, హైఓల్టేజ్ తదితర విద్యుత్ సమస్యలపై వినియోగదారుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారన్నారు.

7న ఆటో డ్రైవర్ల చలో అమలాపురం

అల్లవరం: మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం ఏర్పాటుచేయరాదని కోరుతూ ఈ నెల 7 చలో అమలాపురం నిర్వహిస్తున్నామని ఆటో యూనియన్ జిల్లా అధ్యక్షుడు వాసంశెట్టి సత్తిరాజు మంగళవారం తెలిపారు. ఏఐటీయూసీ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు కేఎస్ బాబు ఆధ్వర్యంలో దేవగుప్తంలో ఆటో డ్రైవర్ల సమావేశం నిర్వహించారు. ఆటో రంగాన్ని నమ్ముకుని వేలాది మంది కార్మికులు బతుకుతున్నారని, ఉచిత బస్సు సౌకర్యంతో వారు రోడ్డున పడే ప్రమాదం ఉందని సత్తిరాజు అన్నారు. కార్యక్రమంలో పలువురు ఆటో కార్మికులు పాల్గొన్నారు.

సమగ్ర శిక్ష ఉద్యోగుల నిరసన

ముమ్మిడివరం: తమ డిమాండ్లను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ విద్యాశాఖ సమగ్ర శిక్ష ఉద్యోగులు చేపట్టిన నిరసన దీక్ష మంగళవారం 14వ రోజుకు చేరుకుంది. స్థానిక ఎయిమ్స్ ఇంజినీరింగ్ కళాశాల వద్ద విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఉద్యోగులు ఉరి తాళ్లు వేసుకుని నిరసన వ్యక్తం చేశారు. వీరికి ఎస్టీయూ, సీఐటీయూ నాయకులు సంఘీభావం తెలిపారు.

ఆరోగ్యశ్రీ.. అపర సంజీవిని

- 3,257 వ్యాధులకు ఆరోగ్యశ్రీ ద్వారా ఉచిత చికిత్స
- ఏడాదికి రూ.5 లక్షల నుంచి రూ.25 లక్షలకు పరిమితి పెంపు
- సంతోషం వ్యక్తం చేస్తున్న లబ్ధిదారులు



కోడూరుపాడులో ఆరోగ్యశ్రీ కార్డులను పంపిణీ చేస్తున్న మంత్రి విశ్వరూప్, ఎంపీ అనురాధ(ఫైల్)

అల్లవరం: గతంలో ఏదైనా రోగమొస్తే నయం చేసుకోవడానికి ఆస్తులు అమ్ముకోవాల్సి వచ్చేది. నిరుపేదలకు కార్పొరేట్ వైద్యం అందించాలన్న సంకల్పంతో మాజీ ముఖ్యమంత్రి, స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రవేశపెట్టి లక్షలాది మందికి పునర్జన్మని ప్రసాదించారు. ఆయన కుమారుడు, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మరో అడుగు ముందుకేసి అదే వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకాన్ని పేదల పాలిట అపర సంజీవినిగా మార్చారు. వైద్యం కోసం ఏ కుటుంబం రోడ్డున పడకుండా, ఏ వ్యాధికైనా వారికయ్యే ఖర్చంతా ప్రభుత్వమే భరించేలా ఆరోగ్యశ్రీ పథకంలో ఒక్కో కుటుంబానికి ఏడాదికి రూ.5 లక్షలుగా ఉన్న పరిమితిని రూ.25 లక్షలకు పెంచారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నిర్ణయంపై లబ్ధిదారులంతా సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఆపద్బాంధవి ఆరోగ్యశ్రీ

ఆరోగ్యశ్రీ పథకంలో కార్డియాలజీ, నెఫ్రాలజీ, న్యూరాలజీ, న్యూరో సర్జరీ, ఆప్తమాలజీ, ఆర్థోపెడిక్ సర్జరీ, పీడియాట్రిక్, జనరల్ మెడిసిన్, పాలిట్రామా, క్యాన్సర్ తదితర విభాగాలకు సంబంధించి 3,257 రకాల రోగాలకు చికిత్స అందిస్తున్నారు. గర్భిణులు సుఖ ప్రసవాలు చేసుకునేందుకు ఆరోగ్యశ్రీలో చికిత్స అందిస్తున్నారు. వీరికి చికిత్స ముందు, తర్వాత కూడా 108 వాహనాన్ని వినియోగించుకునే వీలు కల్పించారు. ప్రభుత్వ ఆస్పత్రి లేదా నెట్‌వర్క్ ఆస్పత్రుల్లో చికిత్స చేయించుకునే వెసులుబాటు రోగికి కల్పించారు. ఏడాదికి రూ.5 లక్షలలోపు ఆదాయమున్న కుటుంబాల్లోని సభ్యులకు ఆరోగ్య సమస్యలు ఎదురైనప్పుడు వైఎస్సార్ ఆరోగ్యశ్రీ పథకంలో చికిత్స చేసి, తిరిగి క్షేమంగా ఇంటికి పంపించే వరకూ బాధ్యత తీసుకుంటున్నారు. ఆరోగ్యశ్రీలో శస్త్ర చికిత్స అనంతరం విశ్రాంతి తీసుకునే సమయంలో రోగులు కోలుకునేందుకు రోజుకు రూ.225 చొప్పున నెలకు గరిష్ఠంగా రూ.5,000 వరకూ ఆసరాగా అందిస్తున్నారు. ఆరోగ్యశ్రీ పథకంపై ఏఎన్ఎం, ఆశ, వలంటీర్లు మొబైల్ యాప్ ద్వారా గ్రామాల్లో ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఆరోగ్యశ్రీ కార్డులను ఇంటింటా పంపిణీ చేస్తున్నారు. తాజాగా ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఆరోగ్యశ్రీలో వైద్యం చేయించుకునేందుకు ఏడాదికి రూ.5 లక్షలుగా ఉన్న పరిమితిని రూ.25 లక్షలకు పెంచడంతో నిరుపేదలకు కొండంత ధైర్యం కలుగుతుంది. అనుకోని ఆపద ఎదురైనప్పుడు ఆరోగ్యశ్రీ ఆపద్బాంధవిగా ఉపయోగపడుతుందని లబ్ధిదారులు చెబుతున్నారు.

ఎప్పటికీ రుణపడి ఉంటాం



నేను ఆరోగ్యశ్రీ పథకంలో బైపాస్ ఆపరేషన్ చేయించుకున్నాను. ప్రస్తుతం నేను చాలా ఆరోగ్యంగా ఉన్నాను. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా నాకు పునర్జన్మ లభించింది. అంతేకాకుండా ఆసరా ద్వారా నా కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంది. వైఎస్సార్ కుటుంబానికి ఎప్పటికీ రుణపడి ఉంటాం.
– నక్కా రాజు, వీరన్న మెరక, అల్లవరం మండలం

ఒక్క రూపాయి ఖర్చు లేకుండా వైద్యం



ఆరోగ్యశ్రీ పథకంలో ఆపరేషన్ ద్వారా బాబుకి జన్మనిచ్చాను. అదే వైద్యం కార్పొరేట్ ఆస్పత్రుల్లో డబ్బులు కట్టి చేయించుకోవాలంటే కనీసం రూ.70 వేలకు పైగా ఖర్చయ్యేది. ఆరోగ్యశ్రీ పథకం కారణంగా ఒక్క రూపాయి ఖర్చు లేకుండా చికిత్స పొందాను.
– కందికట్ల చిన్నారి, కాశీవారిపేట



ఈ ఫొటోలో ఉన్న బాలుడి పేరు బొమ్మి ప్రవీణ్. గోడిలంక హైస్కూల్లో ఆరో తరగతి చదువుతున్నాడు. నెల రోజుల క్రితం జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో గొంతులో టాన్సిల్స్ గుర్తించి ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా ఆపరేషన్ చేశారు. ప్రస్తుతం బాబు ఆరోగ్యంగా ఉన్నాడు. ఆరోగ్యశ్రీ పథకం ద్వారా తన ఇద్దరు పిల్లలకు ఉచితంగా వైద్యం చేయించుకోగలిగామని తల్లి బొమ్మి లక్ష్మి ఆనందం వ్యక్తం చేస్తుంది.

నేటి నుంచి జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలు

అమలాపురం టౌన్: ప్రభుత్వం వినూత్నంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష రెండో విడత కార్యక్రమాలను అమలాపురం పట్టణంలోని 15 వార్డు సచివాలయాల పరిధిలో ఈ నెల 3వ తేదీ నుంచి 24వ తేదీ వరకూ నిర్వహించనున్నట్లు మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణితో పాటు వైస్ చైర్మన్లు, కౌన్సిలర్ల ఆధ్వర్యంలో జరిగే వైద్య శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ నాయుడు విజ్ఞప్తి చేశారు.

ఘనంగా అయ్యప్పస్వామి పడిపూజ



కోనసీమ మహాశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయంలో పడిపూజ చేస్తున్న స్వాములు

అమలాపురం రూరల్: ఈదరపల్లి కోనసీమ మహాశాస్త్ర అయ్యప్ప స్వామి ఆలయం వద్ద మంగళవారం 7వ వార్షికోత్సవం సందర్భంగా స్వామివారి పడిపూజ ఘనంగా జరిగింది. ఆలయ ప్రధాన అర్చకుడు బ్రహ్మశ్రీ కొమాళ్ళపల్లి నటరాజ్ పండిత బృందం, గురుస్వామి గంగుమళ్ళ శ్రీనివాస్ నేతృత్వంలో లక్ష్మీగణపతి హోమం, నవగ్రహ హోమం, అన్నాభిషేకం, మహా పడిపూజ నిర్వహించారు. ఈదరపల్లి కృష్ణస్వామి బృందం భజన కీర్తనలు భక్తులను అలరించాయి. అనంతరం స్వాములకు భిక్ష ఏర్పాటుచేశారు. పూజల్లో గురుస్వామి నడింపల్లి సత్యనారాయణరాజు, చిర్రావూరి రాంబాబు, అయినాల కృష్ణారావు, మోరం దొరబాబు, రామాయణం వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న సురక్ష



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ జె.రాంబాబు తదితరులు

అల్లవరం: ఆరోగ్యాంధ్రప్రదేశ్ లక్ష్యంగా జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని ప్రతీ గ్రామంలో నిర్వహిస్తున్నామని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ అన్నారు. గోడి సచివాలయం వద్ద సర్పంచ్ తోట శ్రీదేవి అధ్యక్షతన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ఇళ్ల శేషగిరిరావు, జెడ్పీటీసీ కొనుకు గౌతమి, ఎంపీటీసీ కాండ్రేగుల వాణి, గ్రామకమిటీ అధ్యక్షుడు దొమ్మేటి వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ కృష్ణప్రసాద్, రేవు శ్రీనివాస్, జల్లి ఏడుకొండలు, కడలి సత్యప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ముమ్మిడివరం: జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ జె.రాంబాబు సూచించారు. మండలంలోని అయినాపురం జెడ్పీ స్కూల్లో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష-2 హెల్త్ క్యాంపు నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మోకా రామారావు అధ్యక్షతన జరిగిన సభలో ఆయన మాట్లాడారు. శిబిరంలో 306 మందికి వైద్యులు వివిధ రకాల వైద్య సేవలు అందించారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ మట్టపర్తి సురేష్, అడిషనల్ జిల్లా వైద్యాధికారి భారతిలక్ష్మి, వైద్యులు శ్రీపూజ, విజయకుమార్ పాల్గొన్నారు.

సమ్మె నేపథ్యంలో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు



మున్సిపల్ వర్కర్స్ యూనియన్ నాయకులతో మాట్లాడుతున్న మున్సిపల్ కమిషనర్ నాయుడు

అమలాపురం టౌన్: మున్సిపాలిటీల్లో ఇప్పటికే కాంట్రాక్ట్ కార్మికులు సమ్మెలో ఉండగా బుధవారం నుంచి అవుట్ సోర్సింగ్ కార్మికులు సైతం సమ్మెకు దిగుతున్నారు. అందుకే గతంలో వికాస్ ద్వారా తీసుకున్న కార్మికులతో పాటు 44 మంది రెగ్యులర్ కార్మికులతో పారిశుధ్య పనులకు ఆటంకం లేకుండా ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టినట్లు మున్సిపల్ కమిషనర్ ఒమ్మి అయ్యప్పనాయుడు తెలిపారు. ఇళ్ల వద్దకు చెత్తను సేకరించే టిప్పర్లు యథావిధిగా వస్తాయని చెప్పారు. మెయిన్ రోడ్లలో ఉన్న షాపుల వద్ద చెత్త సేకరణకు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేశామని, వ్యాపారులు సహకరించాలని విజ్ఞప్తి చేశారు. బుధవారం నుంచి అవుట్ సోర్సింగ్ కార్మికులు కూడా సమ్మె చేస్తున్నట్లు ఏపీ మున్సిపల్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు కె.సత్తిబాబు, నిమ్మకాయల శ్రీనివాస్ తదితరులు కమిషనర్ అయ్యప్పనాయుడును తన చాంబర్‌లో కలిసి తెలియజేశారు.

200 మంది రక్తదానం



శిబిరంలో రక్తదానం చేస్తున్న మహిళలు

అమలాపురం టౌన్: శెట్టిబలిజ యాక్షన్ ఫోర్స్(ఎస్ఏఎఫ్) తొలి వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం స్థానిక శ్రీరామపురంలో మెగా రక్తదాన శిబిరం నిర్వహించారు. ఎస్ఏఎఫ్ వ్యవస్థాపక అధ్యక్షుడు వాసంశెట్టి సుభాష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరంలో ఉభయ గోదావరి జిల్లాలకు చెందిన దాదాపు 200 మంది సంఘీయులైన యువత రక్తదానం చేశారు. మహిళలు సైతం ముందుకొచ్చి రక్తదానం చేయడం విశేషంగా కనిపించింది. శిబిరాన్ని ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) కోనసీమ అధ్యక్షుడు డాక్టర్ వీఎస్ఎస్ఎన్ మూర్తి, డాక్టర్ అనిల్‌కుమార్, డాక్టర్ చెల్లుబోయిన వెంకటేష్, డాక్టర్ సజనానంద్ గుబ్బల, డాక్టర్ దొంగ సాయికిరణ్‌లు జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. అమలాపురం బుద్దాల నాగరత్నం బ్లడ్ బ్యాంక్, సహస్ర బ్లడ్ బ్యాంక్‌ల సిబ్బంది రక్తాన్ని సేకరించాయి. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వాసంశెట్టి సత్యం, దొంగకుమార్ తదితరులు పాల్గొన్నారు.

జాతీయ స్థాయి చిల్డ్రన్ ఆర్ట్‌లో ద్వితీయ స్థానం



ద్వితీయ పురస్కారం అందుకుంటున్న యానాం నవోదయ విద్యార్థులు

యానాం: గత నెల 29, 30 తేదీల్లో ఢిల్లీలోని బాలభవన్‌లో నిర్వహించిన అఖిల భారత జవహర్ నవోదయ విద్యాలయాల జాతీయస్థాయి చిల్డ్రన్ ఆర్ట్ ఎగ్జిబిషన్‌లో యానాం నవోదయకు ద్వితీయ స్థానం లభించిందని ప్రిన్సిపాల్ టీవీఎస్ ప్రకాశరావు మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. 8, 9 తరగతులు చదివే 20 మంది విద్యార్థులు భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను తెలిపేలా చిత్రించిన విజువల్ ఆర్ట్‌కు ద్వితీయ బహుమతి లభించిందన్నారు. నవోదయ విద్యాలయ కమిషనర్ వినాయక్‌గర్గ్, విద్యాశాఖ కార్యదర్శి సంజయ్‌కుమార్‌ల చేతుల మీదుగా విద్యార్థులు బహుమతులు అందుకున్నారని చెప్పారు. త్వరలో ప్రధానమంత్రి మోదీ అధ్యక్షతన జరిగే పరీక్షా పే చర్చా కార్యక్రమంలో యానాం విద్యార్థులు తయారుచేసిన పెయింటింగ్స్, లక్కబొమ్మల ప్రదర్శనకు చోటు లభించిందన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు మణికంఠ, సతీష్, మనోజ్, దుర్గేష్‌లను అభినందించారు.

నూతన సాగు విధానాలపై అవగాహన అవసరం



రైతులకు చెక్కులు అందజేస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: నూతన సాగు విధానాలపై రైతులు అవగాహన పెంచుకోవాల్సిన ఆవశ్యకత ఉందని ఆర్‌ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక వ్యవసాయ రైతు సంక్షేమ కార్యాలయంలో రైతులకు ఒక రోజు శిక్షణా తరగతులను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ రంగంలో వస్తున్న విప్లవాత్మక మార్పులను తెలుసుకోవాల్సిన అవసరముందన్నారు. అనంతరం 2023–24 ఏడాదికి గాను ఇన్‌పుట్ సబ్సిడీగా 45 మంది ఎస్సీ రైతులకు మొత్తం రూ.2.77 లక్షలు, 99 మంది జనరల్ కేటగిరీ రైతులకు రూ.8.44 లక్షల చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో వ్యవసాయాధికారి చిక్కాల జోగిరాజు, ఫీల్డ్‌మెన్ ఐకే ఖాన్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు పండ్ల పంపిణీ



కరక్కాయపేటలో వృద్ధులకు పండ్లు పంపిణీ చేస్తున్న బేబి మీనాక్షి

అమలాపురం రూరల్: మండలంలోని కరక్కాయపేట వృద్ధాశ్రమాన్ని నూతన సంవత్సరం సందర్భంగా మంత్రి పినిపే విశ్వరూప్ సతీమణి, మీనాక్షి ఫౌండేషన్ అధ్యక్షురాలు బేబి మీనాక్షి సందర్శించారు. ఈ సందర్భంగా మీనాక్షి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆమె వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్ కొల్లాటి దుర్గాబాయి తదితరులు పాల్గొన్నారు.

దుప్పట్ల పంపిణీ

అల్లవరం: పుటపర్తి సత్యసాయిబాబా సేవాదళ్ ఆధ్వర్యంలో కొమరగిరిపట్నం, ఎస్.పల్లిపాలెంలోని వృద్ధులకు గాదెరాజు సత్యనారాయణరాజు సమకూర్చిన దుప్పట్లను సర్పంచ్ కొల్లు వెంకటరమణ మంగళవారం అందజేశారు. కార్యక్రమంలో కేవీ రాజు, కొల్లు నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరం తనిఖీ



వైద్య శిబిరాన్ని తనిఖీ చేస్తున్న డీఎంహెచ్‌వో దుర్గారావు దొర

అమలాపురం రూరల్: మండలంలోని పేరూరు-4 సచివాలయం వద్ద మంగళవారం జరిగిన ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాన్ని డీఎంహెచ్‌వో ఎం.దుర్గారావు దొర ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన రికార్డులను పరిశీలించి ఆరోగ్య సిబ్బందికి పలు సూచనలు చేశారు. ప్రజలు ఫ్యామిలీ డాక్టర్ వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట వైద్యాధికారి వెంకటేష్, ఎంపీహెచ్‌వో రామకృష్ణ మూర్తి, సూపర్‌వైజర్ కామేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా లక్ష తులసి పూజలు



కేశవస్వామివారి ఆలయంలో సామూహిక పూజలు చేస్తున్న భక్తులు

తాళ్లరేవు: పవిత్ర ధనుర్మాస మహోత్సవాల్లో భాగంగా మంగళవారం చరిత్ర ప్రసిద్ధిగాంచిన కేశవపురం శ్రీదేవీ, భూదేవి సమేత కేశవస్వామివారి ఆలయంలో స్వామివారికి లక్ష తులసి, రాజేశ్వరి అమ్మవారికి లక్ష కుంకుమ, శ్రీదాసాంజనేయ స్వామికి లక్ష తమలపాకులు, లక్ష సింధూరం తదితర పూజలను వైభవంగా నిర్వహించారు. వేద పండితులు తాతపూడి కేశవాచార్యులు నేతృత్వంలో ఆలయ అర్చకులు పెద్దింటి వెంకట శ్రావణకుమార్ స్వామివారికి పంచామృతాభిషేకాలు, అమ్మవారికి విశేష అర్చనలు, హోమాలు చేశారు. రాజేశ్వరి అమ్మవారికి తాళ్లరేవు కేశవపురం గ్రామానికి చెందిన విశ్రాంత ఆర్మీ ఉద్యోగి జొన్నలగడ్డ సూర్యనారాయణ మూర్తి రూ.3 లక్షల వ్యయంతో వెండిచీర చేయించనున్నట్లు ఈ సందర్భంగా ప్రకటించారు. ఆలయ కమిటీ చైర్మన్ కొల్లు శ్రీనివాస్, కార్యనిర్వహణాధికారి యర్రా వెంకటేశ్వరరావు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

31 వరకూ గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు



ఈదరపల్లిలో వైద్య శిబిరాన్ని ప్రారంభిస్తున్న జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వెంకట్రావు

అమలాపురం రూరల్: జిల్లా పరిధిలో ఈ నెల 2వ తేదీ నుంచి 31వ తేదీ వరకూ 64 బృందాలతో 128 వైద్య శిబిరాల్లో పశువులకు గాలికుంటు వ్యాధి టీకాలు వేస్తామని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ వెంకట్రావు అన్నారు. మంగళవారం ఈదరపల్లి పశు వైద్యశాల వద్ద పశువైద్యాధికారి పూర్ణిమ నాగలక్ష్మి ఆధ్వర్యంలో జరిగిన గాలికుంటు వ్యాధి నివారణ టీకాల శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గాలికుంటు వ్యాధి సోకితే పశువులకు పండ్లు ఏర్పడి ప్రాణాలకే ప్రమాదమన్నారు. అందుకే పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉప సంచాలకులు కర్నేడి మూర్తి, సహాయ సంచాలకుడు ఎల్.విజయరెడ్డి, పశు వైద్య సహాయకులు సాయినాథ్ కరుణ, ప్రసాద్, అంబిక, సమత, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

నేడు కేంద్రమంత్రి పురుషోత్తమ్ రూపాల రాక

యానాం: కేంద్ర మత్స్యశాఖ, పశుసంవర్థక, డెయిరీయింగ్ శాఖా మంత్రి పురుషోత్తమ్ రూపాల బుధవారం యానాం రానున్నారని ఆర్‌ఏఓ మునిస్వామి మంగళవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఆయనతో పాటు మరో కేంద్రమంత్రి మురుగన్ సైతం వస్తారన్నారు. నియోజకవర్గ శివారు మత్స్యకార గ్రామమైన సావిత్రినగర్‌లో మినీ ఫిషింగ్ హార్బర్ వద్ద మత్స్యకారులతో సమావేశమవుతారన్నారు.

గతేడాది ఆన్‌లైన్ మోసాలు రూ.18.30 కోట్లు

యానాం: పుదుచ్చేరి వ్యాప్తంగా గతేడాది రూ.18.30 కోట్ల మేర ఆన్‌లైన్ మోసాలు జరిగాయని సైబర్ క్రైమ్ శాఖాధికారులు మంగళవారం తెలిపారు. ఆయా మోసాలకు సంబంధించి 2,422 ఫిర్యాదులు అందాయన్నారు. 90 కేసులను రిజిస్టర్ చేసి రూ.2.83 కోట్లను రికవరీ చేసి బాధితులకు అందజేశామన్నారు.

సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన



గొల్లవిల్లిలో సీసీ రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న సర్పంచ్ శ్రీదుర్గ

ఉప్పలగుప్తం: మండలంలోని గొల్లవిల్లి గ్రామ పంచాయితీ పరిధి వాడపర్రులో మండల పరిషత్ నిధులు రూ.2 లక్షలతో నిర్మించనున్న సీసీ రోడ్డు నిర్మాణానికి సర్పంచ్ జొన్నాడ శ్రీదుర్గ మంగళవారం శంకుస్థాపన చేశారు. దశల వారీగా గ్రామాల్లో రోడ్లను అభివృద్ధి చేస్తున్నట్లు ఆమె తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యురాలు దోనిపాటి బాలమ్మ, ఉప సర్పంచ్ దొంగ కనక దుర్గ, సొసైటీ అధ్యక్షుడు మారిశెట్టి పుండరీకాక్షుడు, జొన్నాడ చిన్ని తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఐగా ఎంపికైన శ్రీలతకు సత్కారం



శ్రీలతను సత్కరిస్తున్న ఎంపీడీవో గౌరీకుమారి తదితరులు

ఉప్పలగుప్తం: ఇటీవల విడుదలైన ఫలితాల్లో ఉత్తీర్ణత సాధించి ఎస్ఐగా ఎంపికైన ఎస్.కొత్తపల్లి సర్పంచ్ కుంచే చిట్టికుమారి, చిన్ని దంపతుల కుమార్తె కుంచే శ్రీలతను ఇన్‌చార్జ్ ఎంపీడీవో కేఎస్ గౌరీకుమారి మంగళవారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి దాసరి కృష్ణాజీ, దొరబాబు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సద్గురు సూర్యనారాయణగిరి వార్షికోత్సవం



సద్గురు సూర్యనారాయణగిరి

ఉప్పలగుప్తం: మండలంలోని విలసవిల్లిలో సజీవ సమాధి పొందిన యోగి పుంగవుడు సద్గురు సూర్యనారాయణగిరి 81వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం ఆయన ఆలయం వద్ద భక్తులు విశేష పూజలు చేశారు. ఉదయం నుంచి ఏకాహ భజనలు చేసి, మధ్యాహ్నం అన్నసమారాధన నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామి వారిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

వీఓఏల సంఘ నూతన అధ్యక్షురాలిగా ఈశ్వరీబాయి



కమిడి ఈశ్వరీబాయి

తాళ్లరేవు: మండల మహిళా సమాఖ్య వీఓఏల సంఘం నూతన అధ్యక్షురాలిగా కమిడి ఈశ్వరీబాయి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మంగళవారం స్థానిక ప్రజా సంఘాల భవనంలో సంఘ నూతన కమిటీని ఎన్నుకున్నారు. సంఘ అధ్యక్షురాలిగా కమిడి ఈశ్వరీబాయి, ఉపాధ్యక్షురాలిగా బళ్ల ఝాన్సీ, కార్యదర్శిగా మోర్త వెంకటరమణ, సహాయ కార్యదర్శి కొక్కిలిగడ్డ నాగమణి, కోశాధికారిగా చెల్లి దుర్గలను ఎన్నుకున్నారు.